క్లుప్తంగా

అంకితభావంతో పనిచేయాలి



కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులతో జేసీ నవ్య

కర్నూలు కల్చరల్: జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో చదువుతూ కానిస్టేబుళ్లుగా ఎంపికైన అభ్యర్థులను జేసీ, జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జి డాక్టర్ బి.నవ్య అభినందించారు. సోమవారం జేసీ కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ ఆధ్వర్యంలో అభ్యర్థులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లావ్యాప్తంగా 17 మంది అభ్యర్థులు జేసీ సమకూర్చిన పుస్తకాలను చదివి ఉద్యోగాలు సాధించామంటూ ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. జేసీ వారిని అభినందిస్తూ మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

పారా అథ్లెటిక్స్‌లో రెండు స్వర్ణాలు



రెండు స్వర్ణాలు సాధించిన అథ్లెట్ భావ్యశ్రీ

కర్నూలు (టౌన్): రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల్లో కర్నూలుకు రెండు స్వర్ణాలు దక్కాయి. విశాఖపట్నంలో నిర్వహించిన పారా అథ్లెటిక్స్ జూనియర్ పోటీల్లో పెద్దపాడు ఏపీ మోడల్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న భావ్యశ్రీ షాట్‌పుట్, డిస్కస్‌త్రో క్రీడాంశాల్లో పాల్గొని రెండు బంగారు పతకాలు సాధించారు. ఆమె వచ్చే నెలలో గ్వాలియర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికకావడం సంతోషించదగ్గ విషయమని ప్రిన్సిపాల్ ఎస్‌వీ వీరన్నరావు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో సోమవారం శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా శ్రీరామ పట్టాభిషేకోత్సవం ఘనంగా నిర్వహించారు. విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు.



ప్రత్యేక అలంకరణలో సీతారాములు

విధుల్లో చేరిన వన్‌టౌన్ సీఐ

కర్నూలు: కర్నూలు ఒకటవ పట్టణ సీఐగా నియమితులైన ఎం.పార్థసారథి విధుల్లో చేరారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 మంది సీఐలకు స్థానచలనం కల్పిస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఈ నెల 6వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఇక్కడున్న రామయ్య నాయుడును కర్నూలు శివారులోని జగన్నాథగట్టుపై ఉన్న పోలీసు శిక్షణ కళాశాలకు బదిలీ చేసి అక్కడున్న పార్థసారథిని ఒకటవ పట్టణ స్టేషన్‌కు నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో ఆయన సోమవారం విధుల్లో చేరారు.



ఎం.పార్థసారథి

కార్పొరేట్ల కోసమే చీకటి జీఓ



నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): నారాయణ, చైతన్య, భాష్యం స్కూళ్లు, కాలేజీల్లోని సమస్యలను ఎత్తి చూపేందుకు ఎవరూ వెళ్లకూడదన్న ఉద్దేశంతోనే విద్యాశాఖ చీకటి జీఓను తెచ్చిందని, దాన్ని తిప్పికొడతామని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట జీఓ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దమ్ముంటే ప్రభుత్వం విద్యార్థి సంఘాలతో చర్చలు జరపాలన్నారు. విద్యార్థుల సమస్యలు తెలుకునేందుకు నేతలు వెళ్తుంటారని వారిని కట్టడి చేయాలనుకోవడం అవివేకమన్నారు. నాయకులు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఖండ, మహేంద్రబాబు పాల్గొన్నారు.

ప్రజలను తిప్పుకోవద్దు

కర్నూలు (టౌన్): ప్రజలను పదే పదే తిప్పుకోవద్దని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ సూచించారు. సోమవారం సాయంత్రం నగరంలోని దండిగేరిలో ఉన్న 20వ సచివాలయం అలాగే ఖడక్‌పురాలో ఉన్న 21వ సచివాలయాన్ని కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. అలాగే ఏ. క్యాంపులోని రెండు థీమ్ పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అంతకుముందు అదనపు కమిషనర్ ఆర్జీవీ క్రిష్ణ నగరంలోని బుధవారపేట, కిందిగేరి ప్రాంతాల్లోని 35, 36, 37, 39 సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మేనేజర్ చిన్నరాముడు, సూపరింటెండెంట్ రామక్రిష్ణ ఉన్నారు.

‘నులి’పేద్దాం.. అనారోగ్యాన్ని తరిమేద్దాం

- నులి పురుగులతో రక్తహీనత, కడుపునొప్పి వంటి సమస్యలు
- ఏటా రెండు సార్లు ఆల్బెండజోల్ మాత్రలతో పరిష్కారం
- వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాత్రల పంపిణీ
- నేడు జాతీయ నులి పురుగుల అవగాహన దినోత్సవం



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ, డీడీ రామనాథరావు



బాలుడి కడుపులో నులి పురుగులు

కర్నూలు(హాస్పిటల్): చాలా మంది పిల్లలు కడుపునొప్పి అని బాధపడుతుంటారు. ఏ చిన్న పనీ చేయలేక నీరసించిపోతుంటారు. అలాంటి పిల్లల కడుపులో నులిపురుగులు ఉంటాయి. అవి పిల్లల శారీరక, మానసిక, విద్యాపరంగా ఎదుగుదలకు అవరోధంగా మారుతుంటాయి. వ్యక్తిగత శుభ్రత లేకపోవడమే దీనికి కారణంగా వైద్యులు చెబుతున్నారు. ఈ సమస్యను నివారించేందుకు వైద్య ఆరోగ్యశాఖలోని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ద్వారా ఆరు నెలలకోసారి పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం నిర్వహించనున్నారు.

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఐటీఐ, పాలిటెక్నిక్, జువైనల్ హోమ్స్, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఒకటి నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆ రోజున మాత్రలు వేసుకోని వారికి 20వ తేదీన వేసేందుకు కార్యాచరణ రూపొందించారు. ఈ మేరకు జిల్లాలోని 1,886 అంగన్‌వాడీ కేంద్రాలు, 2,387 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, 103 జూనియర్ కళాశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఒకటి నుంచి ఐదేళ్లలోపు పిల్లలు 1,33,282 మంది, 1వ తరగతి నుంచి 12వ తరగతి చదివే విద్యార్థులు 5,21,558 మంది కలిపి మొత్తం 6,54,840 మంది విద్యార్థులకు ఈ మాత్రలు వేయనున్నారు. వీరితో పాటు పాఠశాలలకు వెళ్లని పిల్లలను సైతం గుర్తించి మాత్రలు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వైద్య ఆరోగ్యశాఖతో పాటు విద్య, సర్వశిక్ష అభియాన్, ఐసీడీఎస్, ఇంటర్‌మీడియట్, అనియత విద్య, వికలాంగుల సంక్షేమ శాఖ, డీఆర్‌డీఏ, సాంఘిక సంక్షేమ శాఖ, మున్సిపల్ శాఖలను సమన్వయం చేసుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఒకటి నుంచి రెండేళ్లలోపు పిల్లలకు అర మాత్ర, ఆపై వయస్సున్న పిల్లలకు ఒక మాత్రను నమిలి మింగించేందుకు ఏర్పాట్లు చేశారు.

నులిపురుగుల వ్యాధి లక్షణాలు

రక్తహీనత, ఆకలి తగ్గిపోవడం, కడుపునొప్పి, వికారం-ఆందోళన, వాంతులు, విరేచనాలు (రక్త విరేచనాలు కూడా కావచ్చు), పోషకాహార లోపం, బరువు తగ్గడం, తరచుగా ఇన్‌ఫెక్షన్లకు గురికావడం వంటి సమస్యలు ఏర్పడతాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలి
- ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా మూతలు పెట్టాలి
- పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

పిల్లల భవిష్యత్తుకు పునాది

పిల్లల్లో నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను మింగిస్తున్నామని, ఇది వారి బంగారు భవిష్యత్‌కు పునాది వేస్తుందని డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ చెప్పారు. ఆమె సోమవారం తన ఛాంబర్‌లో కార్యక్రమ పర్యవేక్షకులు, డీడీ రామనాథ్‌రావుతో కలిసి మాట్లాడారు. 12న జిల్లా వ్యాప్తంగా ఒకటి నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నామని, పిల్లలకు ఏదైనా అనారోగ్యం ఉంటే మాత్రలు వేయకూడదన్నారు. 12న మాత్రలు వేసుకోని వారికి 20వ తేదీన మింగించేందుకు ఏర్పాట్లు చేశామని వివరించారు. ఈ మాత్రలు వేసుకోవడం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవన్నారు. నులిపురుగులు నశించి పిల్లలు ఆరోగ్యవంతులుగా మారతారని, చదువులో రాణిస్తారని చెప్పారు. ఆర్‌బీఎస్‌కే జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ మహేశ్వరప్రసాద్, జిల్లా అంధత్వ నివారణ అధికారిణి డాక్టర్ సంధ్యారెడ్డి, ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ భాస్కరరెడ్డి, డీపీఎంవో డాక్టర్ ఉమ తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ జరపాలి

కర్నూలు(సెంట్రల్): కేవీఆర్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ లాలప్ప అవినీతి, నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలని పలు విద్యార్థి, యువజన సంఘాల నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 13 ఏళ్లుగా విద్యార్థుల నుంచి స్పెషల్ ఫీజులు, అక్యుములేట్ ఫండ్, అడ్మిషన్ల ఫీజులను వసూలు చేసి స్వాహా చేశారని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేంద్రనాయుడు, సోషలిస్టు స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివప్రసాదుగౌడ్, పాగంటి రాజు, గోవర్ధన్ నాయుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో కలెక్టర్ పి.రంజిత్‌బాషా ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించి సీఎంఓ నుంచి వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే విచారణ జరపాలని, పీజీఆర్ఎస్ అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలని ఆదేశించారు. జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- ఓర్వకల్ మండలం ఉయ్యాలవాడ ప్రాథమిక పాఠశాల ఆవరణలో చిన్నపాటి వర్షం వస్తే నీరు నిల్వ ఉంటోందని, నీరు నిల్వకుండా శాశ్వత ప్రతిపాదికన చర్యలు చేపట్టాలని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు వెంకటనాగరాజు విన్నవించారు.
- ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన కింద రైతులకు ఇచ్చే మొదటి విడత రూ.2 వేలు తనకు ఖాతాలో జమకాలేదని, వెంటనే జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని తుగ్గలి మండలం జొన్నగిరికి చెందిన ఏఎం నాగులాల్ విన్నవించారు.
- నూరు శాతం వికలత్వం ఉండి 13 సంవత్సరాల వయసు ఉన్నా ఎన్‌టీఆర్ భరోసా కింద పెన్షన్ మంజూరు కావడం లేదని కర్నూలు గురురాఘవేంద్ర నగర్‌కు చెందిన గొల్ల భరణి ఫిర్యాదు చేసింది.

వైఎస్సార్‌సీపీని బలోపేతం చేద్దాం



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు

కర్నూలు (టౌన్): జిల్లా వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేద్దామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం స్థానిక గిప్సన్ కాలనీలోని ఆయన స్వగృహంలో ఇటీవల రాష్ట్రస్థాయి పదవి పొందిన తిరుమలేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్వీ మోహన్ రెడ్డి, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయ మనోహరిలను శాలువాలు కప్పి సత్కరించారు. ఇటీవల పదవులు దక్కిన వారందరినీ ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్వీ మట్లాడుతూ.. జిల్లాలో గ్రామ, మండల స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వైఫల్యాలు, మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి, నాయకులు షరీఫ్, కిషన్, శ్రీనివాసరెడ్డి, మహిళా నాయకులు నాగవేణీ రెడ్డి, భారతి, సుమలత, మంగమ్మ, ఫిరోజ్, శ్రీను, బాషా తదితరులు పాల్గొన్నారు.

అవీ - ఇవీ

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీలోని ఓల్డ్ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' అనే కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి రమేష్‌కుమార్ మాట్లాడుతూ తమ సంఘం ఉద్యోగుల హక్కులే లక్ష్యంగా రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. బకాయిలుగా ఉన్న రూ.30 వేల కోట్లు, పీఆర్‌సీ, ఐఆర్, డీఏ, సరెండర్ లీవ్‌లు, ప్రధాన డిమాండ్ల సాధన కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బంగి శ్రీధర్, కార్యదర్శి ఎస్.సురేష్‌రెడ్డి, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలాలను లులూకు ఇచ్చేందుకు ఒప్పుకోం

కర్నూలు(సెంట్రల్): విజయవాడ నగర నడిబొడ్డున ఉన్న రూ.400 కోట్ల విలువ చేసే 4.15 ఎకరాల ఆర్టీసీ స్థలాన్ని లులూ షాపింగ్ మాల్‌కు అప్పగించేందుకు ఒప్పుకోమని ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏవీ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఆర్టీసీ గవర్నర్‌పేట-1, 2 డిపోలు, పాత బస్టాండ్‌కు సంబంధించిన స్థలాలను కూటమి ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. ఇందుకు సంబంధించి విడుదల చేసిన జీఓ 137ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, అధ్యక్షుడు రంగస్వామి, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎస్‌ఏ బాషా, కోశాధికారి ముత్యాలరెడ్డి, డిపో-1 కార్యదర్శి రామారావు, డీపో-2కార్యదర్శి మహేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్రపతి పాలన విధించాలి

కర్నూలు(సెంట్రల్): దేశంలో బీజేపీ ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించాలని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా డిమాండ్ చేశారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల లోక్‌సభలో ప్రతిపక్ష నేత బీజేపీ ఓట్లను ఎలా చోరీ చేసిందో వివరించిన నేపథ్యంలో ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోకుండా ఉండడాన్ని నిరసిస్తూ ధర్నా చేపట్టినట్లు చెప్పారు. ప్రజాస్వామ్య దేశంలో బీజేపీ, ఎన్నికల కమిషన్ లాలుచీ పడి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయని, వెంటనే దేశంలో మళ్లీ ఎన్నికలు జరపాలని కోరారు. దొంగ ఓట్లపై ఈసీ విచారణ జరపకుండా, మోసాన్ని బయటపెట్టిన రాహుల్‌గాంధీపైనే కేసు నమోదు చేస్తామని బెదిరించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, సయ్యద్‌ఖాద్రిపాషా, అనంతరత్నం మాదిగ, మహేంద్రనాయుడు, బజారన్న, బతకన్న, షేక్ ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలు ప్రశంసనీయం

కర్నూలు కల్చరల్: ఆర్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. నగర శివారులోని మునగాలపాడు సమీపంలో 10 ఎకరాల విస్తీర్ణంలో కేశవ స్మృతి మండలి నూతన భవన నిర్మాణానికి అచలానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీ విరజానంద స్వామి ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు దేశభక్తి కలిగి ఉండాలన్నారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, స్థల దాతలు రామారావు, ఆదర్శ అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

చీకటి జీఓపై 13న నిరసనలు

కర్నూలు(సెంట్రల్): విద్యార్థుల హక్కులను కాలరాస్తున్న కూటమి ప్రభుత్వం చర్యలను నిరసిస్తూ ఈ నెల 13న జిల్లా కేంద్రంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలు రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయించాయి. సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ పీడీఎస్‌యూ, ఇతర సంఘాల నేతల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయా సంఘాల నాయకులు భాస్కర్, రంగప్ప, షాబీర్‌బాషా మాట్లాడుతూ.. ఆగస్టు 1, 2 తేదీల్లో పాఠశాల విద్యాశాఖ డైరక్టర్ విజయరామరాజు, ఇంటర్మీడియెట్ బోర్డు డైరక్టర్ కృతిక శుక్లా ఇచ్చిన చీకటి జీఓలతో విద్యార్థి, యువజన సంఘాల గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాసంస్థల్లోకి తల్లిదండ్రులు, విద్యా కమిటీల సభ్యులు తప్పా ఇతరులెవరూ వెళ్లకూడదని చెప్పడం అన్యాయమన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మహేంద్రబాబు పాల్గొన్నారు.

భారత్ ఎదుగుదలను ఓర్వలేని ట్రంప్

కర్నూలు(సెంట్రల్): మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న భారత్‌ను చూసి ఓర్చుకోలేక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పెంపుతో బెదిరిస్తున్నారని రోజా మహిళ ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత పేర్కొన్నారు. సోమవారం రోజా వీధిలో ట్రంప్ విధానాలను వ్యతిరేకిస్తూ ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. రష్యాతో భారత్ సత్సంబంధాలపై వైరం పెంచేలా కుట్రలు చేస్తున్నారని, ఈ నెల 15న భారత ప్రధాని మోదీ రష్యాకు వెళ్లకుండా నిలువరించేందుకు చూస్తున్నారని వివరించారు.

కళాశాల అభివృద్ధికి కృషి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యకు చేయూతనిద్దామని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోన నాగరాజు పిలుపునిచ్చారు. సోమవారం సంక్షేమ సంఘం నేతలు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల (టౌన్) ప్రిన్సిపాల్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పద్మావతిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కళాశాల అభివృద్ధికి కృషి చేయాలని ఆమెను కోరారు. జిల్లా యూనిట్ గౌరవ సలహాదారు ఎన్‌సీహెచ్ బజారన్న, సభ్యులు పాల్గొన్నారు.

టిడ్కో కాలనీలో వసతులు కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): టిడ్కో గృహ సముదాయంలో కనీస వసతులు లేక అక్కడున్న వారు అల్లాడిపోతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సీపీఎం బృందం టిడ్కో గృహ సముదాయాన్ని సందర్శించి అక్కడున్న వారిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ.. టిడ్కో కాలనీలో తాగడానికి మంచినీళ్లు లేవని, రెండు రోజులకోసారి ట్యాంకర్‌ను పంపుతుండడంతో ఇబ్బందిగా ఉన్నట్లు చెప్పారు. దొంగల బెడదతో ప్రజలు హడలిపోతున్నారని రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపించారు. వీధిలైట్లు లేవని, విష పురుగుల సంచారంతో కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారన్నారు. నాయకులు టి.రాముడు, రాజశేఖర్ వెంట ఉన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ బి.నవ్య తదితరులు



హర్ ఘర్ తిరంగా సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా డ్రగ్స్ వినియోగం, విచ్చలవిడి తిరుగుబాటుతనానికి దూరంగా లేకపోతే జీవితం అగమ్యగోచరంగా మారుతుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో హెచ్ఐవీ/ఎయిడ్స్ నిర్మూలనకు అమలు చేస్తున్న సమగ్ర వ్యూహాలకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ బి.నవ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. యూత్ ఫెస్టు-2025లో భాగంగా జిల్లాలోని యువతీ, యువకులకు 60 రోజులపాటు హెచ్ఐవీ, డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల్లో లెప్రసీ, ఎయిడ్స్, టీబీ తదితర వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాను ఎయిడ్స్ రహితంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ పాల్గొన్నారు.

- అనాథ పిల్లలకు కుటుంబ వాతావరణం కల్పించడమే ఫోస్టర్ అడాప్షన్ ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ పి.రంజిత్‌బాషా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. వివిధ కారణాలతో పిల్లలు తమ కుటుంబాల్లో ఉండలేనప్పుడు పోస్టర్ అడాప్షన్ ద్వారా తీసుకునే తల్లిదండ్రులు వారికి ప్రేమ, అప్యాయతలను అందించాలన్నారు. ఐసీడీఎస్ పీడీ పి.విజయ, డీసీపీఓ టి.శారద పాల్గొన్నారు.
- నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న జాబ్ మేళా పోస్టర్‌ను కలెక్టర్, జేసీలు ఆవిష్కరించారు. ఈనెల 14వ తేదీన కర్నూలులోని పురుషుల డిగ్రీ కాలేజీలో 11 ప్రైవేట్ కంపెనీల్లోని 500 ఖాళీల భర్తీకి జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు naipunyam.ap.gov.in వెబ్ లింక్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు 77804 78910, 90592 90821 నంబర్లను సంప్రదించాలని సూచించారు. డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి, నైపుణ్యాభివృద్ధి శిక్షణాధికారి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.
- 'మట్టి వినాయకుడిని పూజిద్దాం - పర్యావరణాన్ని రక్షిద్దాం' అనే నినాదంతో కూడిన పోస్టర్‌ను కలెక్టర్, జేసీ ఆవిష్కరించారు. రసాయనాలతో చేసిన విగ్రహాల వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని, వాటికి స్వస్తి పలికి మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని పిలుపునిచ్చారు.

తిరంగా సెల్ఫీలు అప్‌లోడ్ చేయండి

స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని ప్రజలు తమ ఇళ్లు, కార్యాలయాలు, పనిచేసే ప్రదేశాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సెల్ఫీలు తీసుకొని హర్ ఘర్ తిరంగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో హర్ ఘర్ తిరంగా సెల్ఫీ పాయింట్‌ను కలెక్టర్ ప్రారంభించి తన సెల్ఫీని తీసుకొని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టరేట్ ఉద్యోగులందరూ సెల్ఫీ పాయింట్‌లో ఫొటో తీసుకొని www.hargharthiranga.com వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అనంతరం జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, సెట్కూరు సీఈఓ వేణుగోపాల్, జిల్లా టూరిజం అధికారి లక్ష్మీనారాయణ సెల్ఫీ తీసుకొని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు.

ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా ఎగరాలి

దేశ ఐక్యతకు జాతీయ జెండా చిహ్నమని, స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని ప్రతి ఇంటా మువ్వన్నెల జెండాను ఎగురవేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ప్రజలకు పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. నృత్యప్రదర్శన చేసిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు.ఎమ్మెల్సీ బీటీ నాయుడు, మునిసిపల్ కమిషనర్ పి.విశ్వనాథ్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రైనేజీలు నిర్మించండి



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): నగరంలోని 13వ వార్డు బంగారుపేట, శ్రీరామ థియేటర్ నుంచి ఆర్ఎస్ రోడ్డు వరకు డ్రైనేజీ నిర్మించాలని, తాగునీటి పైపులైన్లను మెరుగుపరచాలని స్థానికులు రమణ, ఆయేషా, లక్ష్మణమ్మ వినతిపత్రం ఇచ్చారు. సోమవారం స్థానిక నగరపాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

ఫిర్యాదులు ఇవే...

- నిర్మల్ నగర్‌లో మున్సిపల్ పార్కును అభివృద్ధి చేయాలని డీవైఎఫ్ఐ ప్రతినిధులు హుస్సేన్, వెంకటేష్, రాజు విన్నవించారు.
- జొహరాపురం హౌసింగ్ బోర్డు కాలనీలో రెండు పార్కులను అభివృద్ధి చేయాలని నరసింహా, రాజేశ్వరి, ప్రణీల్ రెడ్డి అభ్యర్థించారు.
- తనపై ఆన్‌లైన్‌లో పలు అసెస్మెంట్లు ఉన్నట్లు చూపిస్తున్నాయని, వాటిని తొలగించాలని ఓర్వకల్లు మండలం బైరాపురానికి చెందిన వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు.
- 19వ వార్డు రామ్‌నగర్‌లో సీసీ రహదారి నిర్మించాలని స్థానికులు అబ్దుల్ జబ్బార్ విన్నవించారు.

సంక్షిప్తం

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రాయలసీమ రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ చాడేశ్వరి చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మెడికవర్ హాస్పిటల్ వారు విడుదల చేసిన 'వందేమాతరం హెల్త్ చెకప్ ప్యాకేజీ'ని సోమవారం ఆమె ఆవిష్కరించారు. 40 ఏళ్ల దాటిన వారు తరచూ పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యంగా ఉండాలన్నారు.

కూటమి పాలనలో మద్యపుటేరులు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వంలో మంచినీటికైతే కరువుందని, మద్యానికి మాత్రం ఎలాంటి ఇబ్బంది లేకపోవడంతో ఏరులై పారుతోందని ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు విమర్శించారు. సోమవారం సోమిశెట్టి నగర్‌లోని 19, 20 వార్డుల ఐద్వా సమావేశాన్ని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఎక్కడ చూసిన మద్యం ఏరులై పారుతోందని, తాగిన వారు రోడ్లపైనే దొర్లుతున్నారని, వారి భార్య పిల్లల గురించి పట్టించుకోవడం లేదని ఆవేదన చెందారు. మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రత్నమ్మ, పీఎస్ సుజాత పాల్గొన్నారు.

16న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ నెల 16, 17 తేదీల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు, శ్రీల ప్రభుపాదుల వారి 129వ వ్యాస పూజ మహోత్సవం నిర్వహించనున్నట్లు కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు తెలిపారు. నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని దేవి ఫంక్షన్ హాల్‌లో 16న తెల్లవారుజాము నుంచి వేడుకలు జరుగుతాయని వెల్లడించారు.

గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర కమిటీలో చోటు

కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర కమిటీలో ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరికి చోటు దక్కింది. విజయవాడలో జరిగిన సమావేశంలో ప్రకటించిన కమిటీలో వీరికి స్థానం కల్పించారు. నంద్యాల జిల్లాలో గణేష్ ఉత్సవ సమితిలో కీలకంగా వ్యవహరిస్తున్న రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జి.రామకృష్ణారెడ్డిని ఉపాధ్యక్షులుగా, కర్నూలు జిల్లాలో శ్రీ గణేష్ మహోత్సవ కేంద్ర సమితి జిల్లా అధ్యక్షుడు బి.వేణుగోపాల్‌ను కార్యదర్శిగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీలో చోటు పొందిన ఇరువురికి జిల్లా ఉత్సవ సమితి తరఫున అభినందనలు తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాల ప్రదర్శన

కర్నూలు కల్చరల్: దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుల చిత్రాలతో ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు షంషియ మదరసా మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడు షేక్ మౌలానా అబ్దుల్ జబ్బార్ తెలిపారు. ఆయన సోమవారం గడ్డ వీధిలోని కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహ్మద్ సేకరించిన చిత్రాలతో ఈ నెల 13, 14 తేదీల్లో ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గడ్డ వీధిలోని షంషియా మదరసాలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రదర్శన ఉంటుందన్నారు.

పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలి

కర్నూలు (టౌన్): నగరంలో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని నగరపాలక ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక ఖండేరి, చిదంబర రావు వీధిలోని 1, 2, 3 సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

కర్నూలు: ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గుడుంబాయి తాండ గ్రామ శివారులో పోలీసుల తనిఖీల్లో భారీగా నాటుసారా పట్టుబడింది. సీఐ చంద్రహాస్ ఆదేశాల మేరకు ఎస్ఐ నవీన్‌బాబు తన సిబ్బందితో సోమవారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా గుడుంబాయి తాండకు చెందిన లక్ష్మీనాయక్ ద్విచక్ర వాహనంపై రెండు ప్లాస్టిక్ సంచుల్లో 50 లీటర్ల సారాను కాల్వబుగ్గ గ్రామానికి తరలిస్తూ పట్టుబడ్డాడు. వాహనంతో పాటు సారాను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

నేడు సన్మాన సభ

కర్నూలు(అగ్రికల్చర్): పదవీ విరమణ చేసిన ఏపీ ఎన్‌జీజీవోస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి ఆత్మీయ సన్మాన సభను విజయవంతం చేయాలని కర్నూలు నగర శాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న పిలుపునిచ్చారు. సోమవారం కర్నూలు ఏడీఏ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మంగళవారం ఉదయం 10 గంటలకు బిర్లా గేట్ సమీపంలోని లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో సన్మాన సభ జరుగుతుందని తెలిపారు.

కరపత్రాల పంపిణీ: వెంగళ్‌రెడ్డి అవినీతిపై కొందరు ఎన్‌జీజీవోస్ జిల్లా నేతలు కలెక్టరేట్‌లో కరపత్రాలు పంపిణీ చేయడం గమనార్హం. కర్నూలు జిల్లా బాధిత ఉద్యోగ సంఘాలు, తెలుగుదేశం నాయకుల పేరుతో కరపత్రాలు పంచారు.